ట్రాన్స్‌ఫార్మర్లను బిగించాలి

డిచ్‌పల్లి, డిసెంబర్ 29 : మండలంలోని దూస్‌గాంలో విద్యుత్ సమస్య ఉన్నదని, మంజూరైన ట్రాన్స్‌ఫార్మర్లను అధికారులు బిగించడం లేదని ఆ గ్రామ రైతులు ఆరోపించారు. శుక్రవారం వారు విలేకరులతో మాట్లాడారు. ట్రాన్స్‌ఫార్మర్లను బిగించకపోవడంతో కరెంట్ సమస్యతో వానాకాలం సీజన్‌లో పంటలు ఎండిపోయాయని తెలిపారు. హై వోల్టేజీతో ట్రాన్స్‌ఫార్మర్ కాలిపోయిందని, తమకు మంజూరు చేసిన ట్రాన్స్‌ఫార్మర్‌ను బిగించి, సమస్యను పరిష్కరించాలని కోరారు. లేకపోతే విద్యుత్ శాఖ కార్యాలయాన్ని ముట్టగిస్తామని అన్నారు.

అంగన్‌వాడీ కేంద్రం తనిఖీ

ధర్పల్లి, డిసెంబర్ 29 : మండలంలోని గోవింద్‌పల్లి గ్రామంలో ఉన్న అంగన్‌వాడీ కేంద్రాన్ని ఎంపీపీ నల్ల సారికా హన్మంత్‌రెడ్డి శుక్రవారం తనిఖీ చేశారు. ప్రతిరోజూ విద్యార్థులు, గర్భిణులు, బాలింతలకు అందజేస్తున్న పౌష్టికాహారంపై అంగన్‌వాడీ సూపర్‌వైజర్ బుజ్జిని అడిగి తెలుసుకున్నారు. మెనూ ప్రకారం పౌష్టికాహారం అందించాలని, అంగన్‌వాడీ టీచర్లు సమయపాలన పాటించాలని అన్నారు. అనంతరం రిజిస్టర్లను పరిశీలించారు. ఆమె వెంట అంగన్‌వాడీ టీచర్ లత తదితరులు ఉన్నారు.

నేడు ఉపాధిహామీ ప్రజావేదిక

బోధన్ రూరల్, డిసెంబర్ 29: మండల పరిషత్ కార్యాలయంలో ఉపాధి హామీ పనులపై శనివారం ఉదయం 9 గంటలకు ప్రజావేదిక నిర్వహించనున్నట్లు బోధన్ ఎంపీడీవో పర్భన్న శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. 30.4.2022 నుంచి 31.3.2023 వరకు ఉపాధి హామీ పథకంలో చేపట్టిన పనులపై ప్రజావేదికలో చర్చిస్తారని తెలిపారు.

విచారణ జరపాలి

ఆర్మూర్‌టౌన్, డిసెంబర్29: మేడ్చల్ జిల్లాలోని శ్రీచైతన్య జూనియర్ కళాశాలలో విద్యార్థిని మృతి ఘటనపై విచారణ చేపట్టాలని పీడీఎస్‌యూ నాయకులు డిమాండ్ చేశారు. విద్యార్థిని మృతికి నిరసనగా కళాశాల యాజమాన్యం దిష్టిబొమ్మను దహనం చేశారు. మృతు రాలి కుటుంబానికి రూ.50 లక్షల పరిహారం చెల్లించాలని డిమాండ్ చేశారు.

'ప్రజాపాలన'ను సద్వినియోగం చేసుకోవాలి

కేశాపూర్‌లో దరఖాస్తులను పరిశీలిస్తున్న కలెక్టర్ రాజీవ్‌గాంధీ హన్మంతు

మోస్రా మండల కేంద్రంలో దరఖాస్తులను పరిశీలిస్తున్న డీపీవో జయసుధ

- కలెక్టర్ రాజీవ్‌గాంధీ హన్మంతు
- గ్రామాల్లో రెండో రోజు కొనసాగిన దరఖాస్తుల స్వీకరణ
- పలు గ్రామాల్లో దరఖాస్తుల స్వీకరణ ప్రక్రియను పరిశీలించిన కలెక్టర్

నమస్తే తెలంగాణ యంత్రాంగం, డిసెంబర్ 29 : ప్రజాపాలన కార్యక్రమాన్ని అర్హులు సద్వినియోగం చేసుకోవాలని కలెక్టర్ రాజీవ్‌గాంధీ హన్మంతు సూచించారు. రాష్ట్ర ప్రభుత్వం ఆరు గ్యారెంటీలను ప్రజలకు చేరువ చేసేందుకు నిర్వహిస్తున్న ప్రజాపాలన సభలు జిల్లావ్యాప్తంగా రెండో రోజు శుక్రవారం కొనసాగాయి. గ్రామాలు, వార్డుల్లో చేపట్టిన ఈ కార్యక్రమాలకు పెద్ద సంఖ్యలో తరలివచ్చిన ప్రజలు.. దరఖాస్తు ఫారాలను నింపి అధికారులు, సిబ్బందికి అందజేశారు. పలు గ్రామాల్లో జిల్లా స్థాయి అధికారులు దరఖాస్తుల స్వీకరణ ప్రక్రియను పరిశీలించారు. ఆయా గ్రామాల్లో నిర్వహించిన కార్యక్రమాల్లో స్థానిక ప్రజాప్రతినిధులు, అధికారులు పాల్గొన్నారు.

రూరల్ నియోజకవర్గం పరిధిలోని కేశాపూర్, డిచ్‌పల్లి మండలంలోని ధర్మారం(బీ) గ్రామాల్లో చేపట్టిన ప్రజాపాలన కార్యక్రమాలను కలెక్టర్ శుక్రవారం క్షేత్రస్థాయిలో పరిశీలించారు. ప్రజలకు అందుబాటులో ఉంచిన దరఖాస్తులు, స్వీకరిస్తున్న దరఖాస్తుల ప్రక్రియను పరిశీలించారు. కార్యక్రమ వివరాలను అధికారులతో మాట్లాడి తెలుసుకున్నారు.

దరఖాస్తు ఫారాలను పూరించే విషయంలో ప్రజలకు సహకారమందించాలని కలెక్టర్ అధికారులకు సూచించారు. షామియానా, తాగునీటి సౌకర్యం కల్పించడం, దరఖాస్తులు నింపడానికి ఏర్పాటు చేసిన హెల్ప్ డెస్క్‌లు, దరఖాస్తుల స్వీకరణకు ఏర్పాటు చేసిన ప్రత్యేక కౌంటర్లను పరిశీలించి సంతృప్తి వ్యక్తం చేశారు. ప్రజల సంఖ్యకు అనుగుణంగా కౌంటర్ల సంఖ్యను పెంచాలని, సరిపడా దరఖాస్తులు అందుబాటులో ఉంచాలని ఆదేశించారు. దరఖాస్తులను కొనుగోలు చేయకూడదని, గ్రామపంచాయతీ కార్యదర్శులు, మెప్మా ఆర్పీల ద్వారా దరఖాస్తులను పంపిణీ చేసేలా చర్యలు తీసుకుంటున్నామని తెలిపారు.

మోస్రా మండలకేంద్రంలో దరఖాస్తుల స్వీకరణ ప్రక్రియను డీపీవో జయసుధ తనిఖీ చేశారు. ప్రజల నుంచి స్పందన ఎలా ఉందని అధికారులను అడిగి తెలుసుకొని, పలు సూచనలు చేశారు.

డొంకేశ్వర్ మండలం దత్తాపూర్‌లో, మాక్లూర్ మండలంలోని గుత్ప గ్రామంలో జడ్పీ చైర్మన్ దాదన్నగారి విఠల్‌రావు పాల్గొని మాట్లాడారు.

బ్లాక్ అండ్ వైట్ జిరాక్స్‌తో దరఖాస్తు చేసుకోవచ్చు: ఆర్డీవో

బ్లాక్ అండ్ వైట్ జిరాక్స్‌తో కూడా దరఖాస్తు చేసుకునేందుకు ప్రభుత్వం వెసులుబాటు కల్పించిందని బోధన్ ఆర్డీవో బీ.రాజాగౌడ్ పేర్కొన్నారు. రెంజల్ మండలంలోని రెంజల్, బాగేపల్లి, కునేపల్లి, నీలా, నవీపేట మండలంలోని కోస్లీ, నవీపేట గ్రామాల్లో ఆయన ప్రజాపాలనలో కార్యక్రమాన్ని పరిశీలించారు. ఈసందర్భంగా ఆయన అధికారులకు సూచనలు చేశారు. ఆర్మూర్ మండలంలో నిర్వహిస్తున్న ప్రజాపాలన కార్యక్రమాన్ని ఆర్డీవో వినోద్ కుమార్ పరిశీలించారు. ఫత్తెపూర్, పిప్రి గ్రామాల్లో ఏర్పాటు చేసిన సెంటర్లను ఆకస్మికంగా తనిఖీ చేశారు.

దత్తాపూర్‌లో మాట్లాడుతున్న జడ్పీ చైర్మన్ దాదన్నగారి విఠల్‌రావు

రెంజల్‌లో దరఖాస్తులను పరిశీలిస్తున్న బోధన్ ఆర్డీవో రాజాగౌడ్

వివరాలు తెలుసుకుంటున్న ఆర్మూర్ ఆర్డీవో వినోద్ కుమార్

దవాఖాన భవనంపై నుంచి పడిన వ్యక్తి మృతి

నిజామాబాద్ క్రైం, డిసెంబర్ 29 : జిల్లా ప్రభుత్వ దవాఖానలో మొదటి అంతస్తు కిటికీ నుంచి కింద పడిన వ్యక్తి చికిత్స పొందుతూ శుక్రవారం మృతిచెందాడు. వన్‌టౌన్ ఎస్‌హెచ్‌వో విజయ్‌బాబు తెలిపిన వివరాల ప్రకారం.. ధర్పల్లి మండలం చెరువు తండాకు చెందిన అంబర్‌సింగ్ (44) మూర్ఛ వ్యాధితో బాధపడుతూ ఈ నెల 28వ తేదీన జిల్లా ప్రభుత్వ దవాఖానలో చేరాడు. మొదటి అంతస్తు కిటికీ నుంచి కింద పడడంతో తీవ్రగాయాల పాలయ్యాడు. గమనించిన వైద్యులు సికింద్రాబాద్‌లోని గాంధీ దవాఖానకు తరలించారు. చికిత్స పొందుతూ మృతిచెందాడు. మృతుడి భార్య మలావత్ స్వాతి వన్‌టౌన్ పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేయగా.. కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేపడుతున్నట్లు ఎస్‌హెచ్‌వో తెలిపారు.

రోడ్డు ప్రమాదంలో వృద్ధురాలు దుర్మరణం

పెద్ద కొడప్‌గల్, డిసెంబర్ 29: కామారెడ్డి జిల్లా పెద్దకొడప్‌గల్ మండలంలోని జగన్నాథ్‌పల్లి వద్ద జాతీయరహదారి 161పై శుక్రవారం జరిగిన రోడ్డు ప్రమాదంలో వృద్ధురాలు మృతి చెందింది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. శాంతాపూర్‌కు చెందిన ఒడ్డింటి గంగవ్వ(70), కుమారుడు పోశబోయి మోపెడ్‌పై ఇంటికి వస్తుండగా.. వెనుక నుంచి వచ్చిన కారు ఢీకొట్టింది. గంగవ్వ అక్కడికక్కడే మృతిచెందగా.. పోశబోయికి గాయాలయ్యాయి. కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నామని పోలీసులు తెలిపారు.

రక్తదాన శిబిరం

ఖలీల్‌వాడి, డిసెంబర్ 29 : రెడ్‌క్రాస్ సొసైటీ రాష్ట్ర కార్యవర్గసభ్యులు, టీఎస్ ఎన్‌పీడీసీఎల్ పట్టణ ఏడీఈ తోట రాజశేఖర్ ఆధ్వర్యంలో స్వచ్ఛంద రక్తదాన శిబిరాన్ని శుక్రవారం నిర్వహించారు. రాజశేఖర్ 79వ సారి రక్తదానం చేశారు. ఆయన స్ఫూర్తితో 23 మంది ముందుకు వచ్చి రక్తదానం చేసినట్లు నిర్వాహకులు తెలిపారు. రెడ్‌క్రాస్ జిల్లా చైర్మన్ బుస్సా ఆంజనేయులు మాట్లాడుతూ.. రాజశేఖర్ తన 57వ జన్మదినం పురస్కరించుకొని 79వ రక్తదానం చేసినట్లు తెలిపారు. రక్త నిల్వల కొరతను తీర్చేందుకు యువత, స్వచ్ఛంద సంస్థలు, ఉద్యోగులు ముందుకొచ్చి రక్తదానం చేయాలని కోరారు. కార్యక్రమంలో జిల్లా అసిస్టెంట్ సెక్రటరీ అరుణ్‌బాబు, డాక్టర్ అబ్బాపూర్ రవీందర్, మురళీకృష్ణ, సుమిత, శ్రీనివాస్, ప్రణయ్, సంషుద్దీన్, రాజశేఖర్ పాల్గొన్నారు.

రైతుల దీక్ష విరమణ డిప్యూటీ తహసీల్దార్ హామీతో..



నిమ్మరసం అందజేసి దీక్షను విరమింపజేస్తున్న డిప్యూటీ తహసీల్దార్ రంజిత్

నిజామాబాద్ రూరల్, డిసెంబర్ 29 : మండలంలోని తాళ్ల కొత్తపేట (మల్కాపూర్-ఎం) రైతులు గ్రామ ప్రధానరోడ్డు వద్ద మూడు రోజులుగా చేపట్టిన ఆమరణ నిరాహార దీక్షను శుక్రవారం విరమించారు. గ్రామశివారులో ఉన్న ప్రభుత్వ భూముల్లో కొన్ని దశాబ్దాల నుంచి పంటలు పండించుకుంటున్న చిన్నకారు రైతులు తమకు పట్టాదారు పాస్ పుస్తకాలు అందజేయాలని కోరుతూ సర్పంచ్ లావణ్య భర్త ప్రవీణ్‌తో కలిసి నిరాహార దీక్ష చేపట్టారు. రూరల్ డిప్యూటీ తహసీల్దార్ రంజిత్‌కుమార్ దీక్షా శిబిరానికి వచ్చి బాధిత రైతులతో మాట్లాడారు. క్షేత్రస్థాయిలో సర్వే నిర్వహించి, నిజమైన లబ్ధిదారులకు డిజిటల్ పట్టాదారు పాస్‌పుస్తకాలు అందజేస్తామని హామీఇచ్చారు. దీనిని బాధిత రైతులు అంగీకరించగా.. ప్రవీణ్‌గౌడ్‌కు డీటీ నిమ్మరసం తాగించి ఆమరణ దీక్షను విరమింపజేశారు.

కోటగిరిలో సామాజిక తనిఖీ ప్రజావేదిక

కోటగిరి, డిసెంబర్ 29 : మండల పరిషత్ కార్యాలయంలో 2022-23 సంవత్సర 14వ విడుత సామాజిక తనిఖీని శుక్రవారం నిర్వహించారు. ఫీల్డ్ అసిస్టెంట్లు, పంచాయతీ కార్యదర్శుల నుంచి వివరాలను తెలుసుకున్నారు. ఉమ్మడి మండలంలో రూ. 20 వేలు జరిమానా విధించినట్లు ఏపీవో గంగారాం తెలిపారు. కార్యక్రమంలో అధికారులు, ఫీల్డ్ అసిస్టెంట్లు, కార్యదర్శులు పాల్గొన్నారు.

ఆలయ నిర్మాణానికి రూ.25వేల విరాళం

మోర్తాడ్(కమ్మర్‌పల్లి), డిసెంబర్ 29: కమ్మర్‌పల్లి మండల కేంద్రంలో అయ్యప్ప ఆలయనిర్మాణానికి కమ్మర్‌పల్లికి చెందిన సంత నడ్పి రాజేశ్వర్ దంపతులు రూ.25వేల విరాళాన్ని ఆలయకమిటీ సభ్యులకు శుక్రవారం అందజేశారు. వారిని ఆలయ నిర్మాణ కమిటీ నిర్వాహకులు సన్మానించారు.

2 నుంచి ఉమ్మడి జిల్లాస్థాయి కబడ్డీ, వాలీబాల్ పోటీలు

మోర్తాడ్, డిసెంబర్29: తిమ్మాపూర్ గ్రామంలో శ్రీవేంకటేశ్వర స్వామి బ్రహ్మోత్సవాలను పురస్కరించుకుని జనవరి 2, 3 వ తేదీల్లో ఉమ్మడి జిల్లా స్థాయి కబడ్డీ, వాలీబాల్ పోటీలను గ్రామకమిటీ, ఆలయ కమిటీల ఆధ్వర్యంలో నిర్వహించనున్నట్లు జిల్లా బాల్‌బ్యాడ్మింటన్ సంఘం ప్రధానకార్యదర్శి శ్యామ్ తెలిపారు. ఆసక్తి ఉన్న జట్లు 98483 22092, 6300112813 నంబర్లకు ఫోన్ చేసి వివరాలు నమోదు చేయించుకోవాలని కోరారు.

క్యాలెండర్ ఆవిష్కరణ

క్యాలండర్‌ను ఆవిష్కరిస్తున్న జడ్పీచైర్మన్ దాదన్నగారి విఠల్‌రావు

ఖలీల్‌వాడి, డిసెంబర్ 29 : రైతు ఉత్పత్తిదారుల సంఘం క్యాలెండర్‌ను జడ్పీ కార్యాలయంలో చైర్మన్ దాదన్నగారి విఠల్‌రావు శుక్రవారం ఆవిష్కరించారు. కార్యక్రమంలో సంఘం నవీపేట్ మండల చైర్మన్ పృథ్వీరాజ్, ఇందూరు, డిచ్‌పల్లి చైర్మన్ నాగయ్య, సీనియర్ రైతు నాయకులు టక్కర్ హన్మంత్‌రెడ్డి, ఆకుల పాపయ్య, భూమయ్య, కేసీఆర్ సేవాదళ్ జిల్లా అధ్యక్షుడు రమణారావు, మధుకర్‌రావు, నీలంరెడ్డి, జీవన్‌రావు పాల్గొన్నారు.

విద్యార్థులకు ఉచిత వైద్య పరీక్షలు

కంటి అద్దాలు అందజేసిన అనంతరం విద్యార్థులతో మేయర్, వైద్యులు

ఖలీల్‌వాడి, డిసెంబర్ 28 : నగరంలోని వెంగళ్‌రావు నగర్‌లో ఉన్న ఉర్దూ మీడియం ప్రభుత్వ పాఠశాలలో విద్యార్థులకు సూర్య ఆరోగ్య సంస్థ ఆధ్వర్యంలో వైద్యులు ఉచితంగా శుక్రవారం వైద్యపరీక్షలు నిర్వహించారు. మేయర్ దండు నీతూకిరణ్ సహకారంతో కంటి, దంత పరీక్షలు నిర్వహించి, పలువురికి కంటి అద్దాలను అందజేశారు. కార్యక్రమంలో సూర్యతేజ, సూర్య భగవాన్, రాజేంద్రకుమార్, విక్రమ్, వినోద్, ప్రశాంత్, ఆప్తాల్మిస్ట్ శ్రీకాంత్, డాక్టర్ నితీశ్ కుమార్, తిరుమల డెంటల్ కళాశాల సిబ్బంది, హెచ్‌ఎం భూమయ్య, స్కూల్ చైర్మన్, సిబ్బంది పాల్గొన్నారు.

పాఠశాలకు విరాళం

జక్రాన్‌పల్లి, డిసెంబర్ 29 : మండల కేంద్రంలోని ప్రభుత్వ పాఠశాలకు భక్త మార్కండేయ సంఘం (నంబర్ -2) సభ్యులు శుక్రవారం విరాళం అందజేశారు. రూ.10,100 పాఠశాల అభివృద్ధి కమిటీకి అందజేశారు. కార్యక్రమంలో సర్పంచ్ చంద్రకళా బాలకిషన్, పైపుల రాజారెడ్డి, ఎంపీటీసీలు రూపాల గంగారెడ్డి, మరియా సతీశ్, సంఘ సభ్యులు పాల్గొన్నారు.

టీయూలో 'సాక' పుస్తకావిష్కరణ

ఇందల్వాయి, డిసెంబర్ 29 : టీయూలోని ఆర్ట్స్ అండ్ సైన్స్ కళాశాల సెమినార్ హాలులో జంబూ సాహితీ వేదిక, తెలుగు అధ్యయన శాఖ ఆధ్వర్యంలో దళిత కథా వార్షిక -2022 కార్యక్రమాన్ని శుక్రవారం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా తెలుగు అధ్యయనశాఖ ఆచార్యులు ప్రొఫెసర్ కనకయ్య హాజరై.. పలువురు రచయితలు రూపొందించిన 'సాక' పుస్తకాన్ని ఆవిష్కరించారు. ఈ కార్యక్రమానికి సభాధ్యక్షుడిగా ప్రముఖ కథా రచయిత గుడిపల్లి నిరంజన్, విశిష్ట అతిథులుగా ప్రముఖ సాహిత్య విమర్శకులు, పరిశోధకులు డాక్టర్ సంగిశెట్టి శ్రీనివాస్, డాక్టర్ కోయి కోటేశ్వర్‌రావు, అతిథులుగా డీన్, ఫ్యాకల్టీ ఆఫ్ ఆర్ట్స్ అండ్ బీవోఎస్ చైర్‌పర్సన్ ఆచార్య త్రివేణి, విభాగాధిపతి ఆచార్య లావణ్య, 'సాక' సంపాదకుడు డాక్టర్ సిద్ధంకి యాదగిరి హాజరై మాట్లాడారు. సాక గ్రంథంలో వివిధ కథల గురించి వివరించారు. నక్కా విజయరామరాజు, వి.త్రివేణి, కె.లావణ్య, వివిధ విభాగాల అధ్యాపకులు, పరిశోధక విద్యార్థులు పాల్గొన్నారు.

పుస్తకాన్ని ఆవిష్కరిస్తున్న ప్రొఫెసర్లు

డిచ్‌పల్లి మండల కేంద్రంలోని కేఎన్‌ఆర్ గార్డెన్‌లో క్రిస్మస్ వేడుకలను శుక్రవారం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి రూరల్ ఎమ్మెల్యే డాక్టర్ భూపతిరెడ్డి హాజరై మాట్లాడారు. అనంతరం సుమారు వెయ్యి మందికి క్రిస్మస్ గిఫ్ట్ ప్యాక్‌లను పంపిణీ చేశారు.

– ఇందల్వాయి, డిసెంబర్ 29

సద్వినియోగం చేసుకోవాలి

పోస్టర్లను ఆవిష్కరిస్తున్న ఎంపీ ధర్మపురి అర్వింద్

బాల్కొండ, డిసెంబర్ 29: ప్రతి గడపకూ కేంద్ర ప్రభుత్వ పథకాలు అందాలన్నదే పీఎం మోదీ లక్ష్యమని ఎంపీ ధర్మపురి అర్వింద్ అన్నారు. శుక్రవారం బోదేపల్లిలో నిర్వహించిన వికసిత్ భారత్ సంకల్ప యాత్ర కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. 17 రకాల కేంద్ర ప్రభుత్వ పథకాలను అర్హులైన వారందరూ సద్వినియోగం చేసుకోవాలన్నారు. జనవరి 26 వరకు పథకాల కోసం దరఖాస్తు చేసుకోవచ్చన్నారు. ప్రతిఒక్కరూ ఆధార్ అప్‌డేట్ చేసి బ్యాంకు ఖాతాలకు లింక్ చేసుకోవాలన్నారు. అనంతరం వివిధ పథకాల పోస్టర్లను ఆవిష్కరించారు. తహసీల్దార్ శ్రీధర్, ఎంపీడీవో సంతోష్‌కుమార్, ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.

తడ్‌పాకల్ విద్యార్థులకు తానా ప్రశంసా పత్రాలు

ప్రశంస పత్రాలు చూపుతున్న తడ్‌పాకల్ విద్యార్థులు

ఏర్గట్ల, డిసెంబర్ 29: వారం క్రితం తానా నిర్వహించిన అమ్మ, నాన్న, గురువు శతక పద్య ధారణ పోటీల్లో మండలంలోని తడ్‌పాకల్ జడ్పీ ఉన్నత పాఠశాల నుంచి 19 మంది విద్యార్థులు పాల్గొని ప్రతిభ చూపారు. దీంతో విద్యార్థులకు తానా అంతర్జాతీయ ప్రశంసా పత్రాలు అందడంతో ప్రధానోపాధ్యాయుడు అబ్దుల్ జావిద్, ఉపాధ్యాయులు శుక్రవారం అభినందించారు. విద్యార్థులు అంతర్జాతీయ సాహిత్య వేదిక తానా నుంచి ప్రశంసా పత్రాలు అందుకోవడం సంతోషంగా ఉందని హెచ్‌ఎం అన్నారు. కార్యక్రమంలో తెలుగు పండితుడు ప్రవీణ్ శర్మ, ఉపాధ్యాయులు సుధాకర్, నాగప్ప, రాములు, కృష్ణాప్రసాద్, గంగాధర్, నరేందర్, సుజాత పాల్గొన్నారు.

వైభవంగా విగ్రహప్రతిష్ఠాపన

మోర్తాడ్(కమ్మర్‌పల్లి), డిసెంబర్ 29: కమ్మర్‌పల్లి మండలం ఉప్లూర్ గ్రామంలో అయ్యప్ప విగ్రహప్రతిష్ఠాపన కార్యక్రమాన్ని అయ్యప్ప భక్తులు, ఆలయ కమిటీ ఆధ్వర్యంలో వైభవంగా నిర్వహించారు. వివిధ గ్రామాల నుంచి భక్తులు తరలివచ్చారు. భక్తులకు అన్నదానం చేశారు.

అన్నదాన కార్యక్రమానికి హాజరైన భక్తులు

కల్యాణలక్ష్మి, షాదీ ముబారక్ చెక్కులు అందజేయాలి

శక్కర్‌నగర్, డిసెంబర్ 29: బోధన్ నియోజకవర్గంలో లబ్ధిదారులకు మంజూరైన కల్యాణలక్ష్మి, షాదీ ముబారక్ చెక్కులను అందజేయాలని కోరుతూ శుక్రవారం జిల్లా ఎస్సీ, ఎస్టీ విజిలెన్స్ మానిటరింగ్ కమిటీ మెంబర్ పి.రామకృష్ణ బోధన్ ఆర్డీవో కార్యాలయంలో పరిపాలనాధికారి విఠల్‌కు వినతిపత్రం అందజేశారు. అసెంబ్లీ ఎన్నికల కోడ్ అమలులోకి రావడం కారణంగా పంపిణీ నిలిపివేశారని, ప్రస్తుతం కోడ్ లేనందున వెంటనే అందజేయాలని కోరారు.

రాష్ట్రస్థాయి పోటీలకు గుత్ప విద్యార్థులు

ఎంపికైన విద్యార్థులను అభినందిస్తున్న ఉపాధ్యాయులు

మాక్లూర్, డిసెంబర్ 29: ఈనెల 30, 31, జనవరి 1న నాగార్జునసాగర్‌లో నిర్వహించనున్న రాష్ట్రస్థాయి నెట్‌బాల్ పోటీలకు జూనియర్స్ విభాగంలో గుత్ప ఉన్నత పాఠశాల విద్యార్థులు సాయికుమార్, శివానీ, హర్షిత ఎంపికైనట్లు హెచ్‌ఎం దృపతికుమార్ తెలిపారు. ఎస్ఎంసీ చైర్మన్ రమేశ్, సర్పంచ్ గంట చిన్నయ్య, ఉపాధ్యాయులు విద్యార్థులను శుక్రవారం అభినందించారు.

రాష్ట్ర వీరశైవ లింగాయత్ బలిజ సంఘం ప్రధాన కార్యదర్శిగా దినేశ్ పాటిల్

శక్కర్‌నగర్, డిసెంబర్ 29: తెలంగాణ రాష్ట్ర వీరశైవ లింగాయత్ బలిజ సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శిగా బోధన్ పట్టణానికి చెందిన, రాష్ట్ర హైకోర్టు న్యాయవాది జి.దినేశ్‌పాటిల్ ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. దినేశ్ పాటిల్ ఈ పదవి చేపట్టడం ఇది మూడో సారి. రాష్ట్రంలోని వీరశైవ లింగాయత్ బంజ బలిజ సంఘాల సమస్యల పరిష్కారానికి చర్యలు చేపడతానని ఆయన పేర్కొన్నారు.

హాసాకొత్తూర్‌వాసికి జేసీఐ ప్రశంస

ప్రసంశాపత్రాన్ని అందుకుంటున్న ఊట్నూర్ నరేశ్

మోర్తాడ్(కమ్మర్‌పల్లి), డిసెంబర్ 29: గ్రామీణ ప్రాంత యువతకు వ్యాపార రంగంలో అవకాశాలను కల్పించడం ఎలా అనే అంశంపై జూనియర్ చాంబర్స్ ఆఫ్ ఇంటర్నేషనల్(జేసీఐ) ఇండియా జోన్ 12 ఆధ్వర్యంలో హైదరాబాద్‌లో రెండు రోజుల శిక్షణ కార్యక్రమంలో పాల్గొని ఉత్తమ సభ్యుడిగా ఎంపికై హాసాకొత్తూర్ వాసి, నిజామాబాద్ స్ఫూర్తి ప్రోగ్రాం డైరెక్టర్ ఊట్నూర్ నరేశ్‌కు శుక్రవారం జేసీఐ నుంచి ప్రశంసా పత్రాన్ని అందజేశారు. కార్యక్రమంలో జేసీఐ జోన్ సభ్యులు మహేందర్, గోవింద్, వెంకటేశ్, నవనీత, సూర్యకిరణ్, శివనారాయణ్, భావన తదితరులు పాల్గొన్నారు.

ఆర్థిక సాయం అందజేత

భీమ్‌గల్, డిసెంబర్ 29: మండలంలోని చేంగల్ గ్రామానికి చెందిన ఎనుగందుల నర్సు కుటుంబ ఆర్థిక పరిస్థితి బాగా లేకపోవడంతో పిల్లోల్ల గంగస్వామి ఫర్ సొసైటీ ఆధ్వర్యంలో గంగస్వామి ఆర్థిక సాయం అందజేశారు. నర్సుకు నలుగురు కూతుళ్లు ఉండగా వారిలో దివ్యాంగురాలు కళావతికి బియ్యం, రూ.10వేలు, నిత్యావసర సరుకులు అందజేశామన్నారు.

అయోధ్య శ్రీరాముడి అక్షింతల శోభాయాత్ర

రుద్రూర్/ ఎడపల్లి/ కోటగిరి, డిసెంబర్ 29 : అయోధ్య శ్రీరాముడి అక్షింతల కలశ శోభాయాత్రను రుద్రూర్ మండలకేంద్రంలో శుక్రవారం ఘనంగా నిర్వహించారు. జనవరి 22న అయోధ్యలో నిర్వహించే విగ్రహ ప్రతిష్ఠాపన సందర్భంగా శ్రీరాముని ఆశీర్వాద అక్షింతలు రుద్రూర్‌కు చేరుకోగా.. ఇంటింటికీ పంపిణీ చేసినట్లు గ్రామస్తులు తెలిపారు. గ్రామంలోని ప్రధానవీధుల గుండా రాముని విగ్రహంతో శోభాయాత్ర నిర్వహించారు. చిన్నారుల సీతారామ, లక్ష్మణ, హనుమాన్ వేషధారణలు ఆకట్టుకున్నాయి.

ఎడపల్లి మండలం ధర్మారంలో విలేజ్ కమిటీ ఆధ్వర్యంలో అక్షింతల శోభాయాత్ర నిర్వహించారు. ఈ అక్షింతల కలశాన్ని రథంపై ఉంచి గ్రామంలో ఊరేగింపు నిర్వహించారు. కార్యక్రమంలో సర్పంచ్ పూజ, వీడబీసీ చైర్మన్ చిన్న గంగారాం, ఉపసర్పంచ్ కోటేశ్, సుండు కిషన్, సుండు నర్సయ్య తదితరులు పాల్గొన్నారు.

కోటగిరిలో అక్షింతల శోభయాత్రలో పాల్గొన్న గ్రామస్తులు

కోటగిరి మండల కేంద్రంలో అయోధ్యపూజిత అక్షింతల శోభాయత్రను ఘనంగా నిర్వహించారు. కోటగిరి చావిడిగల్లీ పెద్ద హనుమాన్ మందిరం నుంచి మహా శోభాయాత్ర ప్రారంభమైంది. మహిళలు మంగళహారతులతో శోభాయాత్రలో పాల్గొన్నారు.

నమస్తే తెలంగాణ CLASSIFIEDS క్లాసిఫైడ్స్

CHANGE OF NAME

★I, SAMBARI LAVANYA, W/o. Sambari Mohan, R/o. 5-67/1, Nallavelly, Indalwai, Nizamabad, TS. Changed My Name as SAMBARI PRAMEELA, W/o. Sambari Mohan.
NT-324499

నమస్తే తెలంగాణ క్లాసిఫైడ్స్
4 లైన్ల క్లాసిఫైడ్స్ 200/- మాత్రమే.
ప్రతి అదనపు లైనుకు 50/- మాత్రమే

గమనిక

క్లాసిఫైడ్ ప్రకటనలకు ప్రతిస్పందించే ముందు తగిన రీతిలో క్షుణ్ణంగా విచారించు కోవలసిందిగా పాఠకులకు సూచించడమైనది. ప్రకటనదారు చెబుతున్న లేదా చేసుకుంటున్న క్లెయిములతో నమస్తే తెలంగాణ పత్రికకు ఏ విధమైన సంబంధం లేదు. బ్యాంక్ అకౌంట్ల ద్వారా డబ్బులు ట్రాన్స్‌ఫర్ / డిపాజిట్ చేయవద్దు. పాఠకులు ఈ విషయాన్ని గమనించగలరు.